


వణికిస్తున్న శీతల గాలులు

రంగారెడ్డి అర్బన్, జనవరి9: ఉమ్మడి జిల్లాలో శీతల గాలులు వణికిస్తున్నాయి. తెల్లవారు జామున పొగ మంచు కమ్మేస్తుంది. ఉదయం 9గంటలైనా సూర్యుడు కనిపించడం లేదు. వికారాబాద్ జిల్లా మోమిన్‌పేటలో 14.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం రెడ్డిపల్లిలో 15.2 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు కాగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కేశవరంలో 16.6 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది.

ట్రాఫిక్, మోటార్ వాహన నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు రాయితీ ఆఫర్‌తో జారీ చేసిన ఇ-చలాన్ల చెల్లింపు గడువు ఒక్కరోజు మిగిలింది. ఏళ్ల తరబడి ఇ - చలాన్లు జారీ అయినా వాహనదారులు చెల్లించాల్సిన అపరాధ రుసుముపై సర్కారు రాయితీ ప్రకటించింది. అయితే రాయితీ అవకాశాన్ని వినియోగించుకోని వాహనదారుల నుంచి పూర్తి మొత్తాన్ని వసూలు చేసేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిసింది. బుధవారం వరకు ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోని వారి నుంచి ఇ-చలాన్లకు సంబంధించి పూర్తి రుసుమును వసూలు చేయనున్నారు. ఈ క్రమంలో పోలీసు అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేయనున్నారు.



పెండింగ్ ఇ-చలాన్ కేసుల వివరాలు	
మొత్తం ఇ-చలాన్‌ల సంఖ్య 8,17,551	విధించిన జరిమానా రూ. 33,87,43,190
చెల్లించిన చలాన్లు 5,20,910	రాయితీతో చెల్లించిన అపరాధ రుసుం రూ. 11,27,99,372
పెండింగ్ చలాన్లు 2,96,641	చెల్లించాల్సింది రూ. 11,84,46,990

ఒక్క రోజే!

నేటితో ముగియనున్న పెండింగ్ చలాన్లపై రాయితీ గడువు

- ఇ-చలాన్ల చెల్లింపుల్లో సర్కారు రాయితీ
- 63.71 శాతం వాహనదారులు మాత్రమే సద్వినియోగం
- గడువు దాటిన తర్వాత ప్రత్యేక తనిఖీలు
- ఇ-చలాన్లు పూర్తిగా వసూలు చేయనున్న అధికారులు

వికారాబాద్, జనవరి9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ట్రాఫిక్, మోటార్ వాహన నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులకు జారీ చేసిన ఇ-చలాన్ల చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రాయితీ గడువు నేటితో ముగియనుంది. ఇ -చలాన్లు జారీ అయిన వాహనదారులు తాము చెల్లించాల్సిన అపరాధ రుసుము (జరిమానా)ను నెలలు, సంవత్సరాల తరబడి చెల్లించకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించింది. ఇ- చలాన్ కేసులతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులకు ఊరట కలిగించేందుకు ప్రభుత్వం జరిమానాలో భారీ రాయితీ ప్రకటించినా సోమవారం వరకు జిల్లాలో 63.71 శాతం మాత్రమే సద్వినియోగం చేసుకున్నారు. ద్విచక్రవాహనాలు, ఆటోలపై నమోదైన ఇ- చలాన్‌ల జరిమానాలో 80 శాతం రాయితీ ప్రకటించగా, విధించిన అపరాధ రుసుములో వారు 20 శాతం చెల్లిస్తే ఇ-చలానాలు తొలగిపోతాయి. ఫోర్ వీలర్ వాహనదారులు (లైట్ మోటార్, హెవీ మోటార్ వాహనాలు)కు జారీ చేసిన ఇ-చలాన్లపై విధించిన జరిమానాలో 60 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించగా, మిగిలిన 40శాతం చెల్లిస్తే సరిపోతుంది. అదే ఆర్టీసీ బస్సులకు 90 శాతం రాయితీ ప్రకటించారు. రాయితీ పోగా మిగిలిన 10 శాతం జరిమానా చెల్లిస్తే ఇ-చలాన్లు పరిష్కారం కానున్నాయి.

చెల్లించని వారు 36.29 శాతం మంది

ఇ-చలాన బకాయిల మొత్తాన్ని ఒకేసారి చెల్లిస్తేనే ప్రభుత్వం ప్రకటించిన రాయితీ వర్తించేలా నిబంధన విధించారు. ఇ- చలాన్లు నమోదైన వాహనదారులు తాము చెల్లించాల్సిన జరిమానా చెల్లింపుల్లో రాయితీతో చెల్లించేందుకు గత డిసెంబరు 27వ తేదీ నుంచి అనుమతించగా, బుధవారంతో ఆగడువు ముగియనుంది. రాయితీతో జరిమానా చెల్లించేందుకు ఒకరోజు మాత్రమే గడువు ఉంది. ఇ- చలాన్ కేసులు నమోదైన వారిలో ఇంకా 36.29 శాతం మంది వాహనదారులు మిగిలిపోయారు. ఇ-చలాన్ విధానం ప్రారంభమైనప్పటి నుంచి జిల్లాలో ట్రాఫిక్ నిబంధనలు, మోటార్ వాహనాల నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలపై 817551 ఇ-చలాన్లు నమోదు చేసి రూ.33,87,43,190 అపరాధ రుసుము విధించారు. ఇ-చలానాలు జారీ చేసిన వాహనాలకు సంబంధించి ఈనెల 8వ తేదీ వరకు 520910 చలాన్లకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన రాయితీతో రూ.11,27,88,372 అపరాధ రుసుము చెల్లించారు. ఇంకా జిల్లాలో 296641 ఇ-చలాన్లకు సంబంధించి రూ.11,84,46,990 అపరాధ రుసుము చెల్లించాల్సి ఉంది.



ముందుకు రాని వాహనదారులు

పెండింగ్‌లో ఉన్న ఇ-చలాన్లు పరిష్కరించేందుకు పోలీసు శాఖ ఎంతో శ్రమ కోరుస్తున్నా ఆశించిన ఫలితం లేకపోవడంతో వాహనదారులు చెల్లించాల్సిన జరిమానాలో భారీ రాయితీ ఆఫర్ ఇచ్చింది. పెండింగ్ చలానాలు పరిష్కరించేందుకు జరిమానాలో రాయితీ కల్పిస్తే చెల్లించడానికి ముందుకు వస్తారని, తద్వారా కేసుల పెండెన్సీ ఉండదని భావించిన పోలీసు శాఖ వాహనదారులు అవకాశం కల్పించింది. గతనెల 27వ తేదీ నుంచి ఈనెల 10వ తేదీ వరకు ఇ-చలాన్లు జారీ అయిన వాహనదారులు రాయితీతో చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించింది. ఇ - చలాన్ జరిమానాల చెల్లింపుల్లో వాహనదారులు చాలా వరకు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు పోలీసు శాఖ గుర్తించింది. తనిఖీల సమయంలో వాహనంపై ఇ-చలానాలు పెండింగ్‌లో ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చెల్లించాలని, లేనిపక్షంలో పక్కన పెట్టేస్తామంటూ పోలీసులు హెచ్చరికలు జారీ చేస్తూనే ఉన్నా.. ఇ-చలాన్లపై విధించిన జరిమానా చెల్లించడానికి వాహనదారులు ఆశించిన స్థాయిలో ముందుకు రావడం లేదు. పెండింగ్‌లో పేరుకుపోతున్న ఇ-చలాన్లను క్లియర్ చేసేందుకు 2022లో అప్పటి ప్రభుత్వం వాహనదారులు చెల్లించాల్సిన జరిమానాలపై ప్రత్యేక రాయితీ ప్రకటించింది. ఇ-చలానాలు ఉన్న వాహనదారులు చాలా వరకు సద్వినియోగం చేసుకున్నా.. కొందరు చెల్లించకుండా మొండికేశారు. వాహనాలపై ఉన్న పెండింగ్ చలానాలను క్లియర్ చేసేందుకు కొత్త ప్రభుత్వం భారీ రాయితీ ప్రకటించింది.

గడువు ముగిశాక తనిఖీలు ముమ్మరం

ఇ- చలానాలకు సంబంధించి కల్పించిన రాయితీ అవకాశాన్ని వినియోగించుకోని వాహనదారుల నుంచి పూర్తి మొత్తాన్ని వసూలు చేసేందుకు పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిసింది. బుధవారం వరకు ప్రభుత్వం కల్పించిన రాయితీని సద్వినియోగం చేసుకోని వారి నుంచి పెండింగ్ ఇ-చలాన్లకు సంబంధించి పూర్తిగా వసూలు చేయనున్నారు. ఇ-చలాన్ల జరిమానా చెల్లింపులపై ప్రభుత్వం విధించిన గడువు ముగిసిన తరువాత పోలీసు శాఖ అధికారులు వాహనాల తనిఖీలు ముమ్మరం చేయనున్నారు. అంతే కాకుండా మోటార్ వాహన నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై కఠినంగా వ్యవహరించాలని పోలీసు శాఖ నిర్ణయించినట్లు తెలుస్తోంది.

చెల్లింపునకు నిరాసక్తత

మోటార్ వాహనాల చట్టాలను, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులకు ఫైన్ విధించేందుకు రాష్ట్రంలో 2018 నుంచి ఇ- చలాన్ విధానం అమల్లోకి తీసుకువచ్చారు. ఈ విధానంతో నిబంధనలను ఉల్లంఘించే వాహనదారులపై ఇ-చలాన్లు జారీ చేసి జరిమానా విధిస్తూ వస్తున్నారు. వాహనదారులు రహదారి, ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తిస్తే పోలీసు సిబ్బంది తమ కెమెరాల్లో వాహనాన్ని ఫొటో తీసి పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తేదీ, సమయం, ఉల్లంఘన తీరు, ఏ సెక్షన్ కింద ఇ-చలాన్ వేశారు, విధించిన జరిమానా తదితర వివరాలతో వాహన యజమాని మొబైల్ నంబర్‌కు సమాచారం పంపిస్తున్నారు. ఇ-చలాన్ నమోదైన విషయం తెలిసినా వాహనదారులు సకాలంలో జరిమానా చెల్లించడంలో ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు.


నేవీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న అటవీప్రాంతం

నేవీ రాడార్ ఏర్పాటుకు కదలిక

తాజాగా సీఎంవోను సంప్రదించిన నేవీ రాడార్ అధికారులు

- కొత్త ప్రభుత్వంలో ప్రాజెక్టు ఏర్పాటుకు కదలిక
- రాష్టానికే తలమానికం కానున్న ప్రాజెక్టు
- రూ. 2,934 ఎకరాల భూముల గుర్తింపు
- వికారాబాద్ జిల్లా పూడూరులో ఏర్పాటు

7

ఎన్నికలకు సన్నద్ధం కండి

- రెండు సీట్లు కచ్చితంగా గెలవాలి
- ప్రతీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల నిధులు
- ఆరు గ్యారంటీ స్కీమ్‌ల అమల్లో భాగస్వాములు కండి
- ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి): వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల, మల్కాజిగిరి స్థానాలను కచ్చితంగా గెలవాలని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలకు ఆదేశించారు. పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ కలిసికట్టుగా పనిచేయాలన్నారు. నగరంలోని మర్రిచెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థలో మంగళవారం రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికల సన్నాహాల్లో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే పార్లమెంట్, స్థానిక ఎన్నికలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కంటే పార్లమెంట్ ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు సాధించాలన్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి తరువాత పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలవుతాయని ఇందుకు అందరూ సన్నద్ధం కావాలని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీ స్కీమ్‌లకు విస్తృత ప్రచారం కల్పించడంతో పాటు వాటి అమల్లో ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు, పార్టీ ఇన్‌చార్జీలు భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు కృషి చేయాలన్నారు. నిజమైన లబ్ధిదారులకు పథకాలు అందే విధంగా చూడాలన్నారు. ఇందుకోసం ప్రతి నియోజకవర్గానికి రూ.10కోట్ల నిధులు మంజూరుచేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రుల పర్యవేక్షణలో ఈ నిధులు వినియోగిస్తామని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు కోసం ఇందిరమ్మ కమిటీలను వేసి వీటిని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు.

జిల్లా సమగ్రాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్, జనవరి9: జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ నారాయణ రెడ్డి అన్నారు. జిల్లాలో చేపడుతున్న పనుల పురోగతి, ప్రభుత్వ ప్రాధాన్యత పనులపై మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్థానిక అవసరాలు తీర్చే విధంగా పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని ఆదేశించారు. ఇప్పటికే పీఆర్, ఆర్‌అండ్‌బీ శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులపై నివేదికలు అందజేయాలన్నారు. పాలనాపరమైన అనుమతులు వచ్చిన పనులు వెంటనే గ్రౌండింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అత్యవసరంగా చేపట్టాల్సిన పనుల్లో ప్రాధాన్యతా పరంగా జాబితా రూపొందించాలని సూచించారు. ఇదిలా ఉంటే, స్థానిక అవసరాల కోసం వినియోగించే విధంగా భూసేకరణ చేపట్టాలని, ఇంటర్నేషనల్ స్కూళ్ల ఏర్పాటు కోసం ప్రతి మండల కేంద్రంలో పదెకరాల భూసేకరణ, పరిశ్రమలను నెలకొల్పేందుకు పదెకరాలకు తక్కువ కాకుండా భూముల వివరాలు తీసుకోవాలని ఆయన రెవెన్యూ అధికారులను ఆదేశించారు. , ధరణిలో పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా పనిచేయాలని రెవెన్యూ అధికారులతో స్పష్టం చేశారు. జాతీయ రహదారులకు, రైల్వే పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియలో జాప్యం లేకుండా వారం రోజుల్లో పూర్తి చేసి నివేదికలు అందజేయాలని ఆయన ఆదేశించారు. ఖాళీగా ఉన్న ఉద్యోగుల వివరాలు, అనువైన పంటలు సాగు చేసే విధంగా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు.

బయట కొనసాగుతున్న గురుకులాలను మార్చాలి...

నియోజకవర్గాల బయట నిర్వహిస్తున్న గురుకుల పాఠశాలలు, కళాశాలలను వారం రోజుల్లోగా సంబంధిత నియోజవర్గాల పరిధిలోకి మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మంజూరైన గురుకుల పాఠశాలలకు, కళాశాలలకు వారం రోజుల్లోగా భూ కేటాయింపు జరిగేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మన ఊరు మన బడి కింద చేపట్టిన పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల జాబితాలను రూపొందించాలని, పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో ఆశా వర్కర్లు, సిబ్బంది ఖాళీల జాబితాలు రూపొందించాలని, ఆసుపత్రుల భవనాలు, అవసరమైన వైద్య పరికరాలపై నివేదికలు రూపొందించాలని, ఆసుపత్రుల్లో వాటర్ ప్లాంట్, జనరేటర్ సదుపాయం కల్పించేందుకు ప్రతిపాదనలు పంపించాలని ఆయన వైద్య ఆరోగ్య శాఖ అధికారిని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ అమిత్ నారాయణ్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, ఆర్డీవోలు విజయకుమారి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్యారాచూట్ లీడర్లు వద్దు!

- ఎంపీ ఎన్నికల్లో స్థానికుడికే అవకాశం ఇవ్వాలి
- మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి ఎంపికపై బీజేపీ సీనియర్ నాయకుల మొర


మాట్లాడుతున్న రంగారెడ్డి అర్బన్, మేడ్చల్ రూరల్, మేడ్చల్ పట్టణ జిల్లాల అధ్యక్షులు

మేడ్చల్ జనవరి9 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : దేశంలోనే అతి పెద్ద పార్లమెంటు నియోజకవర్గమైన మల్కాజిగిరి పార్లమెంటు స్థానంలో పోటీకి ఆ పరిధిలోని నాయకులకే అవకాశం ఇవ్వాలని, ప్యారాచూట్ లీడర్లు వద్దని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, మేడ్చల్‌రూరల్ జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి, రాష్ట్రఉపాధ్యక్షుడు కొంపల్లి మోహన్‌రెడ్డి అధిష్ఠానాన్ని కోరారు. ఈ మేరకు వారు మంగళవారం దమ్మాయిగూడ తిరుమల గార్డెన్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో 7 అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయన్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఎంతో మంది నాయకులు 45 ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్నారని, వారిని అధిష్ఠానం గుర్తించి అవకాశమివ్వాలని కోరారు. మల్కాజిగిరి పార్లమెంటు పరిధిలోని వ్యక్తికి అవకాశమిస్తే అందరం కలిసికట్టుగా గెలిపిస్తామని వారు స్పష్టం చేశారు. నియోజకవర్గంపై అవగాహన లేని వ్యక్తులకు అవకాశమిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ప్రపంచమంతా నేడు మోదీ వైపు చూస్తున్నదని , మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రాంతాలకు చెందినవారు నివాసం ఉంటున్నారని, అన్నింటిని దృష్టిలో పెట్టుకుని స్థానికుడికే అవకాశమివ్వాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో ఘట్‌కేసర్ మండల ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి, సంపత్ యాదవ్, తిరుమలరెడ్డి, రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.


గోవాలో స్విమ్మింగ్ స్టంట్‌లో ఎమ్మెల్యే మల్లారెడ్డి

మల్లన్నా.. మజాకా!

- నియోజకవర్గ నేతలతో ఎమ్మెల్యే మల్లారెడ్డి గోవా టూర్
- మూడురోజులు పాటు సరదా..సరదాగా..
- స్విమ్మింగ్ స్టంట్‌లతో ఎమ్మెల్యే ఎంజాయ్

మేడ్చల్‌టౌన్, జనవరి9 : ఎన్నికల్లో తన కోసం పని చేసిన మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మేడ్చల్ నియోజక వర్గంలోని కొందరు బీఆర్ఎస్ నాయకులతో స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి మూడు రోజుల పాటు ఎంజాయ్ చేయటానికి గోవా వెళ్లారు. ఫిర్జాదీగూడ, జవహర్ నగర్ కార్పొరేటర్లతో కలిసి ఆదివారం నాడు బయలుదేరిన నేతలు సోమవారం సముద్రం నీళ్లలో జలకాలాడుతూ ఉత్సాహంగా స్విమ్మింగ్ స్టంట్‌లు చేస్తున్నారు. గాలిలో ప్యారషూట్ విహారం లాంటి ఫోటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావటంతో స్థానికులు ఆసక్తిగా తిలకిస్తున్నారు. స్విమ్మింగ్ స్టంట్‌లు, ప్యారషూట్ రైడ్‌లు చేస్తున్న మల్లారెడ్డి ఫోటోలు, వీడియోలు చూసిన అభిమానులు మల్లన్నా... మజాక అంటున్నారు.

ఉందామా...వెళ్దామా!

- అందరి చూపు...అధికార పార్టీ వైపు
- పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో మారనున్న మేడ్చల్ సీన్?

మేడ్చల్‌టౌన్, జనవరి9 : అసెంబ్లీ ఎన్నికల అనంతరం మేడ్చల్ నియోజకవర్గంలోని రాజకీయ నేతల్లో నిశబ్ధ వాతావరణం నెలకొంది. ఎమ్మెల్యే ఉన్నా...ప్రయోజనం సున్నా... అంటు బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు చర్చించు కుంటున్నారు. స్థానికంగా తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవటానికి కొందరు నేతలు పార్టీలో ఉందామా...వెళ్దామా... అంటూ తమ దగ్గరి వారితో సలహాలు, సూచనలు తీసుకుంటున్నారు. నియోజక వర్గంలోని మండలం, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో పలు హోదాల్లో ప్రజాప్రతినిధులుగా ఉన్న వారిలో అత్యధికులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు కావటం గమనార్హం. ఈ నేతల్లో చాలా మంది ఇతర పార్టీల నుంచి బీఆర్ఎస్‌లో కి వచ్చిన వారు కావటం విశేషం. ప్రస్తుతం ఈ నేతలు రాజకీయ భవిష్యత్ తీర్చి దిద్దుకోవటానికి గతంలో బీఆర్ఎస్‌లో చేరి ప్రజలకు సేవలందిస్తూ మంచి గుర్తింపు పొందిన వారూ ఉన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ అధికారానికి దూరం కావటంతో ప్రతిపక్ష పార్టీలో ఉండి ప్రజలకు సేవలందిచ లేక పోతామన్న అభిప్రాయంలో ప్రజాప్రతినిధుల్లో కనబడుతోంది. అసెంబ్లీ ఎన్నికల ముందు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులకు కాంగ్రెస్ వారు పెద్దఎత్తున ఆఫర్లు ఇచ్చినప్పటికీ వారు తిరస్కరించి పార్టీ కోసం పని చేసి అభ్యర్థిని గెలుపించుకున్నారు. కాగా పరిస్థితులు మారటంతో వారి రాజకీయ జీవితం ప్రశ్నార్థకంగా మారింది. దీంతో అధికార కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రజా ప్రతినిధులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరటానికి పార్టీ పెద్దలతో చర్చలు జరిపినట్లు పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగుతుంది.



మేడ్చల్ నియోజక వర్గం లోని ఐదు మండలాల్లో 61 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటిలో అత్యధికులు బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌లే ఉన్నారు. సర్పంచు పదవీ కాలం జనవరి 31 నాటికి ముగియనుంది. దీంతో వారు కాంగ్రెస్‌లో చేరేందుకు యత్నిస్తున్నారు. అదే విధంగా నాలుగు మండల పరిషత్ స్థానాలు, మూడు జిల్లాపరిషిత్ ప్రాదేశిక స్థానాల్లో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు ఉన్నారు. దీనికి తోడు ఏడు మున్సిపాలిటీలు, మూడు కార్పోరేషన్‌లతో పాటు రైతు సహకార సంఘాల్లో బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రతినిధులే ఉన్నారు. నియోజక వర్గాన్ని శాసించటానికి బీఆర్ఎస్ నాయకుల సంఖ్య అత్యధికంగా ఉన్నప్పటికీ ప్రజాప్రతినిధులు మాత్రం బీఆర్ఎస్‌లో కొనసాగటం పట్ల సదీర్ఘంగా ఆలోచిస్తున్నట్లు బీఆర్ఎస్ బడానాయకుల అనుచరులు అంటున్నారు.

పార్లమెంట్ ఎన్నికల ముందు..

అధికార కాంగ్రెస్ పార్టీలో చేరదలచిన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు పార్లమెంట్ ఎన్నికల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం మారిన వెంటనే పార్టీ మారితే తమకు ప్రాధాన్యం దొరకదన్న ఉద్దేశంతో కొందరు నేతలు పార్లమెంట్ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరటానికి సిద్ధమవుతున్నారు. ఎన్నికల ముందు పార్టీలో చేరి ఆ పార్టీ అభ్యర్థి గెలుపు కోసం పనిచేస్తే తగిన గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నారు. తద్వార తిరిగి స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ తరపున పోటీచేసే అవకాశం లభిస్తుందని నేతలు భావిస్తున్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్‌లో కొనసాగినా తమ రాజకీయ భవిష్యత్తు గల్లంతు కావటం ఖాయమని నేతలు భావిస్తున్నారు.

వలసలతో పార్టీని పటిష్టం చేసుకునే దిశలో

దీర్ఘకాలంగా అధికారం లేక పోవటంతో కాంగ్రెస్ పార్టీకి నియోజకవర్గంలోని క్షేత్రస్థాయిలో పట్టు సడలింది. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నేతలను తమ పార్టీలో చేర్చుకుంటే పార్లమెంట్ ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి కలిసొస్తుందని కాంగ్రెస్‌పెద్దలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆహ్వానం పంపిన నేతలకే తిరిగి పార్టీలో తీసుకోవడానికి ఇప్పటికే కాంగ్రెస్‌పార్టీ సీనియర్లు ప్రయత్నాలు ప్రారంభించారు. కాగా తమ రాజకీయ భవిష్యత్తుకు పూర్తి భరోసా ఇస్తే వెంటనే పార్టీ మారుతామన్న ప్రతిపాదనలను కొందరు ప్రజాప్రతనిధులు కాంగ్రెస్ పెద్దల ముందు పెట్టినట్లు సమాచారం.

నిబంధనలను ఉల్లంఘించే..

రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు

● రంగారెడ్డి జిల్లా అదనపు జిల్లా కలెక్టర్ భూపాల్‌రెడ్డి


మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి

రంగారెడ్డి అర్బన్, జనవరి 9 : నిబంధనలు ఉల్లంఘించే రైస్ మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉంటుందని జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి హెచ్చరించారు. మంగళవారం పౌరసరఫరాల శాఖ అధికారులు, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్లు, రైస్‌మిల్లర్లతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రైతుల నుంచి ప్రభుత్వ పరంగా కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లింగ్ చేయాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కోటాకు అనుగుణంగా ధాన్యం నిల్వలను భారత ఆహారసంస్థకు చేరవేయాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రతీ రైస్ మిల్లులో పూర్తి సామర్థ్యానికి అనుగుణంగా కస్టమ్ మిల్లింగ్ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తున్నందున, ఇకపై మిల్లర్ల అలసత్వాన్ని తాము ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. జిల్లాలోని రైస్ మిల్లులలో సీఎంఆర్ కేటాయింపుల పట్ల నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాము ఎలాంటి సాకులు వినదల్చుకోలేదని, అవసరమైతే ధాన్యాన్ని కొనుగోలు చేసి అయినా నిర్ణీత గడువులోపు లక్ష్యానికి అనుగుణంగా సీఎంఆర్ డెలివరీ చేయాలని మిల్లర్లకు తేల్చిచెప్పారు. అవసరమైతే ప్రైవేట్ ధాన్యం మిల్లింగ్‌కు విరామం ఇచ్చి, సీఎంఆర్ లక్ష్యసాధనపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, సాధ్యమైనంత వరకు ఎక్కువ మొత్తంలో బాయిల్డ్ రైస్ నిల్వలు అందించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మిల్లర్లు పంపించే సీఎంఆర్ నిల్వలను వెనువెంటనే దిగుమతి చేసుకునేలా గోడౌన్ల వద్ద కూలీల సంఖ్య పెంచాలని, మిల్లర్లకు కోరిన వెంటనే గోడౌన్లలో బియ్యం దిగుమతి కోసం ఎక్కడ స్థలం అందుబాటులో ఉంటే అక్కడికి మిల్లర్లను అనుమతించాలని సూచించారు. డీఎస్‌వో మనోహర్ రాథోడ్, సివిల్ సప్లయిస్ డీఎం విజయలక్ష్మి, ఎఫ్‌సీఐ ఏరియా మేనేజర్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్‌మిల్లర్లు, అధికారులు పాల్గొన్నారు.

కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యం

● రంగారెడ్డి జిల్లా మంగల్‌పల్లిలో వెలుగుచూసిన ఘటన

ఇబ్రహీంపట్నం, జనవరి 9 : ఇబ్రహీంపట్నం మండలం మంగల్‌పల్లిలో ఓ వ్యవసాయ క్షేత్రంలో గల రేకుల గదిలో మంగళవారం కుళ్లిన స్థితిలో గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. శరీరమంతా నల్లగా మారి ఉబ్బింది. 10-12 రోజుల క్రితమే మహిళ మృతిచెంది ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మంగల్‌పల్లికి చెందిన కాలె రాజ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన గుండ్ల శ్రీశైలం పొలాన్ని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. ఆ పొలంలో ఓ రేకుల షెడ్డు రూం ఉంది. మంగళవారం ఉదయం వ్యవసాయ సామాగ్రికని రాజ్‌కుమార్ గది తలుపుతీసి చూడగా మహిళ మృతదేహం కనిపించింది. దీంతో రాజ్‌కుమార్ వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాడు. పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరించి మృతదేహాన్ని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి వయస్సు 50-55 సంవత్సరాలు ఉంటుందని, కుడిచేయిపై మూడు స్టార్ గుర్తులు నల్లని, ఎరుపు రంగులో ఉన్నాయని, మెడలో నల్ల, ఎర్ర పూసలు, ఓం గుర్తు లాకెట్‌తో పుస్తెలతాడు ఉందన్నారు. కుడికాలుకు నల్లని దిష్టిదారం, చెవులకు రింగులు ఉన్నాయి. ఎడమ చేతిపై హిందీలో ఓ టాటూ ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గోవిందరెడ్డి తెలిపారు.

రోడ్డుపైనే మురుగు..
పట్టించుకోని పాలనా యంత్రాంగం

మొయినాబాద్ రూరల్, జనవరి 9 : మండల పరిధిలోని హిమాయత్‌నగర్ గ్రామంలో పారిశుధ్యం లోపించింది. పంచాయతీ కార్యదర్శి నిర్లక్ష్యం, పాలకవర్గం అలసత్వంతో ఇళ్ల మధ్య, ప్రధాన రహదారులపై నిలుస్తున్న మురుగునీటితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని నెలలుగా మురుగు నీరు రోడ్లపైనే నిల్వ ఉండటంతో దోమల సంచారం అధికమై రోగాలబారిన పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధి హిమాయత్‌నగర్ గ్రామంలోని సాయిబాబా దేవాలయం ఎదుట, కుమ్మరి బస్తీలోకి వెళ్లే రోడ్డుపక్కన అండర్‌డ్రైనేజీలో మురుగునీటితో పాటు చెత్త పేరుకుపోయిం ది. ఇళ్ల నుంచి వచ్చే నీటితో చిలుకూరుకు వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


హిమాయత్‌నగర్‌లోని ప్రధాన రోడ్డుపై మురుగు నీరు



బొంరాస్‌పేట్ రైతు వేదికలో ధాన్యం కమిషన్ డబ్బుల విషయంలో మహిళల సమక్షంలో విచారణ చేస్తున్న అధికారులు

ధాన్యం కమిషన్ గోల్‌మాల్‌పై విచారణ

- రూ.2లక్షలు రికవరీ

బొంరాస్‌పేట్, జనవరి 9: ఐకేపీ మహిళలు ధాన్యం కొనుగోలు చేపట్టగా వచ్చిన కమిషన్ పక్కదారి పట్టడంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. మండల పరిధిలోని బురాన్‌పూర్ గ్రామానికి చెందిన మహిళా సంఘాల సభ్యులు రబీ సీజన్ 2019 నుంచి 2023వరకు ధాన్యం కొనుగోలు చేపట్టారు. ఇప్పటి వరకు కమిషన్ విషయానికి వస్తే రూ.9లక్షల 99వేల 49 ప్రభుత్వం నుంచి ఐకేపీ మహిళలకు వచ్చింది. అందులో ఇటీవల బురాన్‌పూర్ ఐకేపీ వీఏన్ఏ కమిషన్ వివరాలను మహిళలకు తెలపకుండా తప్పించుకోవడంతో మహిళలకు అనుమానం వచ్చి ఇటీవల ప్రజావాణిలో విచారణ కోసం దరఖాస్తు చేశారు. అంతకుముందే మండలస్థాయి ఐకేపీ అధికారులకు విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో నేరుగా డిసెంబరు 18న కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించారు. ఐకేపీ, ఏపీడీ నర్సింహులు, ఆడిటర్ ప్రవీణ్‌కుమార్ మంగళవారం బురాన్‌పూర్ గ్రామ మహిళల సమక్షంలో విచారణ చేపట్టారు. అందులో ఇప్పటికే రూ.2లక్షలు ఓ ఉన్నతాధికారి భార్య బ్యాంకు ఖాతాలో జమ చేసినట్లు రుజువు కావడంతో ఆ రెండు లక్షలు రికవరీ చేసినట్లు అధికారులు తెలిపారు. మిగతా సమగ్ర విచారణకు తిరిగి బుధవారం అధికారులు రానున్నట్లు ఏపీయం అంజిలయ్య తెలిపారు.

నేవీ రాడార్ ఏర్పాటుకు కదలిక

- తాజాగా సీఎంవోను సంప్రదించిన నేవీరాడార్ అధికారులు
- కొత్త ప్రభుత్వంలో ప్రాజెక్టు ఏర్పాటుకు కదలిక
- రాష్ట్రానికే తలమానికం కానున్న ప్రాజెక్టు



నేవీరాడార్ ప్రాజెక్టు ఏర్పాటు చేయనున్న పూడూరులోని అటవిప్రాంతం

పరిగి, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఇండియన్ నేవీరాడార్ వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టు ఏర్పాటుకు కదలిక వచ్చింది. కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు తాజా పరిణామాలు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. ఈ ఇండియన్ నేవీరాడార్ ప్రాజెక్టు పూడూరు మండలం దామగుండం అటవీప్రాంతం వేదిక కానుంది. నేవీ రాడార్‌కు సంబంధించి నేవీ శాఖ కమాండో కార్తీక్‌శశాంక్ మంగళవారం నేవీరాడార్ ప్రాజెక్టుకు సంబంధించి సీఎంవో అధికారులను సంప్రదించారు. బుధవారం సీఎం రేవంత్‌రెడ్డిని కూడా కలిసే అవకాశం ఉందని సమాచారం. ఏడేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టు ఏర్పాటుకు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో ప్రాజెక్టు ఏర్పాటు తెలంగాణ రాష్ట్రానికే తలమానికం కానుంది ఈ నేవీ రాడార్ ప్రాజెక్టు. ఈ నేవీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటు కోసం రిజర్వ్ ఫారెస్ట్ ఆధీనంలో ఉన్న 2,934 ఎకరాల భూములను అప్పట్లోనే గుర్తించారు. 2011--12లో ప్రాజెక్టు ప్రక్రియ ప్రారంభం కాగా, 2015లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒక అంచనాకు వచ్చాయి. గతంలోనే పలుమార్లు ఇండియన్ నేవీరాడార్ శాఖ అధికారులు దామగుండం దేవాలయ భూములను కూడా తీసుకునేందుకు పూడూరు గ్రామస్తులతో సమావేశం నిర్వహించి అంగీకారం కూడా తీసుకున్నారు. ఆ తర్వాత భూముల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం, కేంద్రప్రభుత్వానికి మెలిక పెట్టింది. సికింద్రాబాద్‌లోని బైసన్‌పోలో మైదానం స్థలం ఇస్తే, పూడూరులో నేవిరాడార్‌కు భూములు అప్పగిస్తామని గతంలో కేసీఆర్ ప్రభుత్వం మెలిక పెట్టడంతో కేంద్రరక్షణ శాఖ బైసన్ పోలో మైదానం ఇచ్చేందుకు నిరాకరించింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించి భూముల అప్పగింతకు కేసీఆర్ నిరాకరించడంతో ప్రాజెక్టు ఏర్పాటు పెండింగ్‌లో పడింది. ప్రస్తుతం కొత్త సర్కారు ఏర్పాటుతో కదలిక ప్రారంభమైంది. స్థానిక ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి కూడా కొత్త సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా చెప్పడంతో ప్రాజెక్టు ఏర్పాటు ముందడుగు పడినట్లుగా చెబుతున్నారు.

ఇక్కడే ఎందుకు..

వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అటవీ శాఖ ప్రాంతం సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తులో ఉండడంతో నేవీ రాడార్ ప్రాజెక్టు ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుందని అధికారులు ఈ ప్రాంతాన్ని ఎంపిక చేశారు. ఎత్తైన ప్రదేశం కావడంతో రాడార్ ద్వారా సముద్రమార్గాన్ని వీక్షించే అవకాశం ఉంది. రాడార్ వ్యవస్థ శత్రుదుర్భేద్యాలకు దూరంగా ఉండాలన్నదే ప్రధాన ఉద్దేశం. దామగుండం అడవులు అందుకు అనుకూలంగా ఉన్నాయని గుర్తించారు. పైగా నేవీ రాడార్‌కు అవసరమైన విశాలమైన స్థలం లభించడం కూడా ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రధాన కారణంగా చెప్పవచ్చు. ఇక్కడ నుంచే అంతర్జాతీయ స్థాయిలో నేవీ వ్యవస్థను సిగ్నల్స్ ద్వారా మానిటరింగ్ చేస్తారు. దేశంలో కొన్ని ప్రదేశాలలో మాత్రమే ఉన్న నేవీరాడార్ పూడూరులో ఏర్పాటుకు ఆ శాఖ సన్నహాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనప్పటికీ పూడూరులో ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుండడంతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించనుంది.

రూ.2000కోట్లతో భారీ ప్రాజెక్టు

రాష్ట్ర రాజధాని నుంచి సరిగ్గా 60 కిలోమీటర్ల దూరంతో పాటు, సముద్ర మట్టానికి 360 అడుగుల ఎత్తైన ప్రాంతాన్ని ఇండియన్ నేవీ శాఖ ఎంచుకుంది. దామగుండం అటవీ ప్రాంతాల్లో 2,934 ఎకరాలను గుర్తించిన ఇండియన్ నేవీ 2011-12లో ప్రతిపాదనలు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ముందు పెట్టింది. ఇట్టి భూ భాగం రిజర్వ్ ఫారెస్ట్‌కు సంబంధించింది కావడం, అక్కడ పురాతన దామగుంగం రామలింగేశ్వర దేవాలయం ఉండడంతో మొదటల్లో కొన్ని అడ్డంకులు ఏర్పడ్డాయి. ఈ భూములను స్వాధీనం చేసుకునేందుకు అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వానికి రూ.127 కోట్లు చెల్లించేందుకు అంగీకరించింది. ఇదే సమయంలో పురాతన దేవాలయానికి దారి వదలాలని గ్రామస్తులు మెలిక పెట్టారు. ప్రస్తుతం ఉన్న దేవాలయం అలాగే ఉంచి, పూడూరు గ్రామంలో రూ.5 కోట్లతో కొత్త గుడి నిర్మాణంతో పాటు, అభివృధికి నిధులు ఇస్తామని హామీ ఇచ్చింది. అయితే ఇంతకాలం పెండింగ్‌లో ఈ ప్రాజెక్టు ఏర్పాటుకు అవరోధాలు తొలగినప్పటికీ భూముల అప్పగింత జాప్యంతో పెండింగ్‌లో పడింది. తాజాగా నేవీరాడార్ వ్యవస్థకు సంబంధించిన ఈ ప్రాజెక్టును ప్రారంభించే ప్రక్రియకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలిసింది. ప్రాజెక్టు అధికారికంగా ప్రారంభం కావాలంటే పర్యావరణం, అటవీశాఖ, దేవాదాయశాఖ, కాలుష్యనియంత్రణ బోర్డు, రెవెన్యూ, పంచాయతీరాజ్ తదితర 16 రకాల అనుమతులతోపాటు, రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇప్పటికే ఇండియన్ నేవీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలోకి చే 15 రకాల అనుమతులు కూడా పొందినట్లు అధికారవర్గాలు పేర్కొన్నాయి.

నేవీరాడార్ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది



కొన్నేళ్ళుగా పెండింగ్‌లో ఉన్న నేవీరాడార్ ప్రాజెక్టు ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రాజెక్టు గురించి సీఎం రేవంత్‌రెడ్డికి వివరించా. భూముల అప్పగింత విషయంలో సానుకూలతను తెలిపారు. రెండువేల కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మించనున్నారు. కేంద్రం నుంచి కూడా దాదాపుగా అన్ని రకాల అనుమతులు వచ్చాయి. ఇక రాష్ట్ర ప్రభుత్వం కూడా సానుకూలతో ఉంది. త్వరలోనే ప్రాజెక్టు ఏర్పాటు పనులు చేపట్టే అవకాశం ఉంది. జిల్లాకు దేశ స్థాయిలో గుర్తింపు రానుంది.

-డాక్టర్ రామ్మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే, పరిగి

సమాజంలో విద్య, వైద్యం అతి ముఖ్యం

- విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయం
- భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్
- ముచ్చింతల్‌లో స్కూల్ బిల్డింగ్ ప్రారంభం



ముచ్చింతల్‌లో పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న కపిల్ దేవ్, జగపతిరావు, పార్వతిరెడ్డి

శంషాబాద్ రూరల్, జనవరి 9: నేడు సమాజంలో విద్య, వైద్యం అతి ముఖ్యమైనవని, అలాగే ఖరీదైనవని భారత మాజీ క్రికెటర్ కపిల్ దేవ్ అన్నారు. శంషాబాద్ మండలం ముచ్చింతల్‌లో నిర్మించిన జూపల్లి బాలమ్మ మెమోరియల్ మండల పరిషత్ పాఠశాల భవనాన్ని మంగళవారం ఆయన మై హోంగ్రూప్ వైస్‌చైర్మన్ జూపల్లి జగపతిరావు, కృషి ఫౌండేషన్ చైర్‌పర్సన్ పార్వతిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. తాను ప్రారంభించిన ఈ ప్రభుత్వ పాఠశాల నుంచి విద్యార్థులు ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నట్టు కపిల్ దేవ్ అన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతుల్లేక పేద విద్యార్థులు చదువులో వెనుకబడుతున్నారని చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలను తయారుచేయాలని కోరారు. విద్యాభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. దేశంలో ఎంతో మంది బాలలు విద్యకు దూరం అవుతున్నారని, అలాంటి వారికి విద్యనందించేందుకు ఉత్తమ స్కూళ్లు అవసరం అని, అందుకు దాతలు ముందుకు రావాలని కపిల్‌దేవ్ కోరారు. స్కూల్ భవన నిర్మాణానికి కృషిచేసిన మైహోం గ్రూప్ సంస్థను ఆయన అభినందించారు. కృషి ఫౌండేషన్ దేశంలో ఏన్నో స్కూళ్లను దత్తత తీసుకుందని పేర్కొన్నారు. విద్యార్థులకు వసతులు కల్పిస్తే విద్యలో రాణిస్తారన్నారు. మైహోం గ్రూప్ వైస్‌చైర్మన్ జగపతిరావు మాట్లాడుతూ... ముచ్చింతల్‌లో మాజీ క్రికెటర్ కపిల్‌దేవ్‌తో ప్రభుత్వ పాఠశాల ప్రారంభింపచేయడం సంతోషంగా ఉందన్నారు. గ్రామీణ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు అధునాతన వసతులతో పాఠశాల గదులను నిర్మించామన్నారు. కృషి ఫౌండేషన్ చైర్‌పర్సన్ పార్వతిరెడ్డి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు తెలంగాణలో 7 స్కూళ్లను నడుపుతున్నామని, దేశ వ్యాప్తంగా 75 స్కూళ్లను తాము దత్తత తీసుకున్నామని తెలిపారు. మొత్తం 1.5లక్షల మంది విద్యార్థులను తమ సంస్థ ద్వారా చదివిస్తున్నట్టు చెప్పారు. పాఠశాల చుట్టూ మొక్కలు, ఆట స్థలం, బెంచీలు వంటివి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం డీసీపీగా సునీతారెడ్డి



మహేశ్వరం, జనవరి 9: రాచకొండ పరిధిలోని మహేశ్వం జోన్ డీసీపీగా డి. డి.సునీతారెడ్డి బాధ్యతలు స్వీకించారు. రాష్ట్ర నార్కోటిక్ డ్రగ్స్ కంట్రోల్ డీసీపీగా విధులు నిర్వహించిన డి.సునీతారెడ్డి బదిలీపై మహేశ్వరానికి వచ్చారు. తుక్కుగూడలోని డీసీపీ కార్యాలయంలో మంగళవాం విలేకర్లతో ఆమె మాట్లాడుతూ.. మహేశ్వం జోన్ ఇబ్రహీంపట్నం, మహేశ్వరం ఏసీపీ పరిధుల్లో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషిచేస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలుకూడా భాగస్వాములు కావాలన్నారు. శాంతి భద్రతలకు ఎవరు విఘాతం కలిగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలను ఎవరు సరఫరా చేసినా వారిపై కఠిన చర్యలు ఉంటాయన్నారు. సైబర్ నేరాలు, గంజాయి వంటి వాటి నిర్మూలనకు త్వరలో గ్రామాల్లో సదస్సులు నిర్వహించి ప్రజలకు, యువతకు అవగాహన కల్పిస్తామన్నారు.



కేంద్ర పథకాల గురించి వివరిస్తున్న అధికారులు, నాయకులు

కేంద్ర పథకాలను వినియోగించుకోవాలి

కొత్తూర్, జనవరి 9: కేంద్ర ప్రభుత్వం నిరుపేదల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను వినియోగించుకోవాలని, వికసిత్ భారత్ కార్యక్రమం ద్వారా పథకాలు ప్రజలకు చేరువవుతాయని బీజేపీ సీనియర్ నాయకులు ఎర్రవెల్లి నాగరాజుచారి, అమడపురం నర్సింహగౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలోని నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమానికి ఏపీజీవీబీ మేనేజర్ జలేజా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు వివరించడం జరుగుతుందన్నారు. వ్యవసాయాధికారి గోపాల్, ఏఈవో దీపిక, హెల్త్ సూపర్‌వైజర్ రవికుమార్, బీజేపీ నాయకులు ఉరేందర్, కోస్గి మల్లేష్, ప్రభాకర్‌చారి, శ్రీకాంత్, సందీప్‌సింగ్, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూముల రక్షణకు చర్యలు

- కడ్తాల చెన్నకేశవస్వామి ఆలయ భూములకు ఫెన్సింగ్ వేసిన ఎండోమెంట్ అధికారులు
- అన్యాక్రాంత భూముల స్వాధీనం



ఆలయ భూములను సర్వే చేస్తున్న అధికారులు

కడ్తాల్, జనవరి 9: ఆలయ భూముల రక్షణకు అధికారులు చర్యలు చేపట్టారు. అన్యాక్రాంతమైన భూములను స్వాధీనం చేసుకున్నారు. ఆలయ భూముల రక్షణలో భాగంగా ఫెన్సింగ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. కడ్తాలలోని శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయానికి కడ్తాలలో సర్వే నంబర్ 76లో 6.05ఎకరాలు, అన్మాస్‌పల్లి సర్వే నంబర్ 130లో 3.06ఎకరాలు, 120లో 15.3ఎకరాలు, సర్వే నంబర్ 125లో 9.33ఎకరాల చొప్పున భూములున్నాయి. ఈ భూములను ఆక్రమించుకున్నారని ఆరోపణలు రావడంతో అధికారులు రక్షణకు చర్యలు ప్రారంభించారు. ఏడీ సర్వే నిర్వహించారు. మంగళవారం సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ నిర్వాహకుడు ఆంజనేయులుతో కలిసి కంచె పనులను దేవాదాయ శాఖ ఈవో మోహన్ రావు, మైసిగండి ఆలయ ఈవో స్నేహలత ప్రారంభించారు. ఈవో మోహన్ రావు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 120లో ఆక్రమణకు గురైన 1.28ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో 28గుంటల భూమి కూడా అన్యాక్రాంతమైనట్లు గుర్తించామని, రెండుమూడు రోజుల్లో పక్క రైతు పొలానికి సర్వే చేయించి ఆక్రమించిన భూమిని స్వాధీనం చేసుకుంటాం అన్నారు. అలాగే సర్వే నంబర్ 130లో 128గజాల ఆలయ భూమిలో ఓ వ్యక్తి ఇంటి నిర్మాణాన్ని చేపట్టాడని, 222గజాల్లో అన్మాస్‌పల్లిలో ఆలయ భూమిలో వాటర్ ట్యాంక్, జీపీ కార్యాలయం, స్కూల్ నిర్మించారని తెలిపారు. దీనిపై ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శికి నోటీసు ఇచ్చినట్టు మోహన్‌రావు వివరించారు. సర్వే నంబర్ 125లో ఫెన్సింగ్ వేస్తుండగా సమీప వెంచర్ నిర్వాహకులు అధికారులను అడ్డుకున్నారు. ఈ భూమి తమదని, ఆలయ భూమి కాదని వాదనకు దిగారు. రెండు రోజుల్లో సర్వే చేయిస్తామని, అప్పటి వరకు కంచె వేయొద్దని అధికారులను, ప్రజాప్రతినిధులను రియల్టర్లు కోరారు.

ఘనంగా గోదాదేవి దీపోత్సవం



అమ్మవారికి దీపోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 9: ఎదులాబాద్‌లోని గోదాసమేతమన్నార్ రంగనాయకస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా గోదాదేవికి దీపోత్సవం నిర్వహించారు. తెల్లవారుజామున్నే అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మంగళహారతులు సమర్పించారు. పండితులు గోదాదేవికి తిరుప్పావై ఆలకించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఎదులాబాద్ సింగిల్‌విండో డైరెక్టర్ చందుపట్ల ధర్మారెడ్డి ధనుర్మాస ఉత్సవాల్లో నెలరోజుల పాటు ఆలయంలో పూలతో ప్రత్యేక ఆలంకరణ చేపడుతారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు టీపీ లక్ష్మణాచార్యులు, గోవిందాచార్యులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి రోజున సెలవు ప్రకటించాలి

తాండూరు, జనవరి 9: బంజారా ఆరాధ్య దైవం సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతిని పురస్కరించుకొని ఫిబ్రవరి 15న సాధారణ సెలవుగా ప్రకటించాలని గోర్ బంజారా సంఘం ఆధ్వర్యంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రంలో సుమారు 50లక్షల జనాభా ఉన్న బంజారుల విన్నపాన్ని గౌరవించాలని జిల్లా గోర్‌సేన అధ్యక్షుడు రాందాస్ వికారాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కె.రమేష్‌లు అన్నారు.

పేదలకు సీఎం సహాయనిధితో భరోసా



పరిగి: సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



తాండూరు: బాధితుడికి సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పరిగి, జనవరి 9: పేదలందరికీ సీఎం సహాయనిధితో భరోసా కల్పిస్తున్నట్లు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన బాధిత కుటుంబాలకు మంగళవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ అందని వారందరికీ సీఎంఆర్ఎఫ్ ద్వారా చేయూతనం దిస్తామని తెలిపారు. పేదలు వైద్యానికి డబ్బులు లేవని ఇబ్బందులు పడొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యరంగాలకు ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఏ పథకం కింద వర్తించని వారికి కూడా తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎన్కెపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి, బాసుపల్లి మాజీ సర్పంచ్ అనంతయ్య పాల్గొన్నారు. కాగా, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిని పరిగి ప్రభుత్వ కళాశాల ఆధ్యాపక బృందం మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను సన్మానించారు. ఎమ్మెల్యేను కలిసినవారిలో అధ్యాపకులు సాయినాథ్, సతీష్, వరస్వామి, గోపాల్, ప్రభాకర్, రవి, శ్రీనివాస్, కృష్ణ, అనిత, సౌమ్య, నర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట్: చెక్కు అందజేస్తున్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్

దోమ: మండలంలోని బాసుపల్లి గేటు సమీపంలో ఇటీవలే జీ.చిన్ననర్సయ్య రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష చెక్కును పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ అనంతయ్య, ఎన్కెపల్లి సర్పంచ్ అశోక్‌రెడ్డి, నాయకులు యాదగిరి, అశోక్, రాములు పాల్గొన్నారు.

బొంరాస్‌పేట్: ఏర్పుమళ్ల గ్రామానికి చెందిన హరీశ్‌గౌడ్‌కు సీఎం సహాయనిధి నుంచి రూ.3లక్షలు మంజూరయ్యాయి. ఈ చెక్కును మంగళవారం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్, ఉపసర్పంచ్ ఎల్లప్పగౌడ్ చేతులమీదుగా అందజేశారు.

యాలాల: మండలంలోని జక్కెపల్లి గ్రామానికి చెందిన రాంచెంద్రప్ప కుమారుడు గుండెకు సంబంధించిన వ్యాధితో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.2లక్షల 50వేల చెక్కును ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి మంగళవారం అందజేశారు.

క్రైం కార్నర్


తాండూరులో వ్యక్తి దారుణ హత్య



ఘటనాస్థలాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ శేఖర్‌గౌడ్

తాండూరు, జనవరి 9: తాండూరు పట్టణం ఫయాజ్ పెట్రోల్ బంక్ ఎదురుగా గల టెంట్‌హౌస్ సమీపంలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. సోమవారం ఉదయం అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పరిశీలించి హత్య జరిగినట్లు నిర్ధారించుకున్నారు. మృతుడు ధారూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన వీరారెడ్డి(42)గా గుర్తించారు. అతడి ముఖం, మర్మాంగాలపై తీవ్రగాయాలైనట్లు చెప్పారు. గుర్తుతెలియని వ్యక్తులు తీవ్రంగా కొట్టి హత్య చేసి ఉంటారని తెలిపారు. మృతుడి తండ్రి నర్సింహారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తాండూరు ఎస్ఐ అబ్దుల్ రవూఫ్ తెలిపారు. మృతదేహానికి శవపరీక్ష నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.

బావిలో దూకి యువకుడి ఆత్మహత్య



కొండాపూర్‌లోని బావిలో తేలిన రమేష్ మృతదేహం

ఘట్‌కేసర్‌రూరల్, జనవరి 9: కడుపునొప్పి భరించలేక ఓ యువకుడు బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌కు చెందిన ఓర్సు రమేష్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొంతకాలంగా రమేష్ కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. దీంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స తీసుకున్న నయం కాలేదు. ఈ నెల 6న భరించలేనంతగా కడుపునొప్పి రావడంతో ఆస్పత్రికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగిరాలేదు. మంగళవారం ఉదయం కొండాపూర్‌లోని ఓ వ్యవసాయ బావిలో రమేష్ మృతదేహాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఊరెళ్లేవారు జాగ్రత్తలు వహించాలి



ప్రచార వాహనాన్ని ప్రారంభిస్తున్న ఘట్‌కేసర్ సీఐ ఎం.మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 9: సంక్రాంతి పండుగకు ఊరేళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఘట్‌కేసర్ సీఐ ఎం.మహేందర్‌రెడ్డి సూచించారు. ఘట్‌కేసర్ పోలీసుస్టేషన్‌లో మంగళవారం సంక్రాంతి పండుగకు ఊరేళ్లే వారికోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించే ప్రచార వాహనాన్ని సీఐ ప్రారంభించారు. ఊరేళ్ళే వారు ఇంట్లో విలువైన వస్తువులను, నగదు ఉంచొద్దని, బ్యాంక్ లాకర్లలో జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని సూచించారు. ఇంటిముందు చెప్పులు ఉంచాలని, బయటగేటుకు లోపల నుంచి తాళం వేయాలన్నారు. ఇంటి ముందు గదిలో లైట్ వేసి ఉంచాలని తెలిపారు. పేపర్, మిల్క్‌బాయ్స్‌ను రావొద్దని చెప్పాలని, బీరువాల్లో బంగారు ఆభరణాలు, నగదును పెట్టొద్దని సూచించారు. ఇంటి ముందు ముగ్గులు వేసేటప్పుడు బంగారు ఆభరణాలు కనిపించకుండ చూసుకోవాలన్నారు. ఊరు వెళ్ళే ముందు స్థానికులకు, నమ్మకస్తులకు, పోలీసుస్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని కోరారు. కాలనీలలో గుర్తుతెలియని వ్యక్తులు అనుమానస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, లేదా 100కు సమాచారం ఇవ్వాలని సీఐ సూచించారు.

మేడ్చల్ టౌన్: సంక్రాంతి పడుగ జరుపుకోవటానికి సొంత ఊరుకు వెళ్లే వారు తమ ఇళ్లలో దొంగతనాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మేడ్చల్ సీఐ బీ.నర్సింహారెడ్డి అన్నారు. మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలోని పలు కాలనీల్లో నివాసముంటున్న వారు పండక్కి సొంతూరు వెళ్తే ఇళ్లలో దొంగతనాలు జరిగే వీలుంటుందన్నారు. ఇంట్లో బంగారం, ఇతర ఖరీదైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలన్నారు. ఎవరైనా తప్పనిసరిగా ఇంటికి తాళంవేసి వెళ్లాల్సివస్తే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అపార్ట్‌మెంట్‌లో ఉండేవారు చుట్టూ ఇంటిపక్కలవారికి సమాచారం ఇవ్వాలని కోరారు. సంక్రాంతి పండుగ సమయంలో చాలా మంది తమ సొంత ఊళ్లకు వెళ్తుండటంతో దొంగతనాలు జరిగేందుకు వీలు లేకపోవలేదన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామన్నారు. తమ సిబ్బంది ఎప్పటికప్పుడు బస్తీల్లో, కాలనీల్లో గస్తీ విధిస్తారన్నారు. కాలనీలో ఎవరైనా కొత్త వారు వస్తే తక్షణమే తమకు సమాచారం అందించాలని సీఐ నర్సింహారెడ్డి కోరారు.

ట్రాఫిక్ చలాన్లపై రాయితీకి నేడే చివరి గడువు



తాండూరు పట్టణంలో వాహనాలు తనిఖీలు చేస్తున్న పోలీసులు

తాండూరు/తాండూరు రూరల్/మోమిన్‌పేట్, జనవరి 9: ట్రాఫిక్ చలాన్లపై ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీ బుధవారం(నేడు) ముగియనుందని తాండూరు అర్బన్ సీఐ రాజేందర్‌రెడ్డి తెలిపారు.మంగళవారం ఆయన మాట్లాడుతూ.. టూ, త్రీ వీలర్స్‌కు 80శాతం, ఆర్టీసీ బస్సులకు 90శాతం, భారీ వాహనాలకు 60శాతం రాయితీ ప్రకటించినట్లు చెప్పారు. తాండూరు నియోజకవర్గంతోపాటు వివిధ మండలాల్లో ఇంకా చలాన్లు చెల్లించని వాహనదారులు త్వరగా చెల్లించాలని సూచించారు. అదేవిధంగా తాండూరు రూరల్ సీఐ రాంబాబు చలాన్లపై రాయితీని వినియోగించుకోవాలన్నారు. తర్వాత పోలీసుల తనిఖీలు నిర్వహించి పూర్తి మొత్తాన్ని రాబట్టుకుంటారని హెచ్చరించారు. అదేవిధంగా మోమిన్‌పేట్ సీఐ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న రాయితీని వినియోగించుకోవాలన్నారు.

బోధనలో మెళకువలపై అవగాహన



ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈవో గోపాల్

మోమిన్‌పేట్, జనవరి 9: మండలంలోని పాఠశాలలను ఎంఈవో గోపాల్, మండల నోడల్ అధికారి మల్లేశం, హెచ్ఎం గౌరి శంకర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు భౌతిక రసాయన శాస్త్ర పాఠ్యాంశాలపై పాటించాల్సిన మెళకువలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులను అభినందిస్తున్న ఆంజనేయులు

కులకచర్ల, జనవరి 9: యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు. మండలంలోని బండ వెల్కిచర్లలో మూడురోజులుగా క్రికెట్ టోర్నమెంట్ కొనసాగుతోంది. ఈ సందర్భంగా క్రీడాకారులను ఆయన మంగళవారం కలిసి అభినందించారు. క్రీడల నిర్వాహకులు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గోవర్ధన్‌రెడ్డిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్‌నాయక్, మాజీఎంపీపీ ఆంజనేయగౌడ్ జలీల్ పాల్గొన్నారు.

29 నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీటీసీ ధారాసింగ్

పెద్దేముల్, జనవరి 9: పెద్దేముల్ మండల కేంద్రంలో ఈ నెల 29వ తేదీ నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జడ్పీటీసీ ధారాసింగ్ తెలిపారు. పెద్దేముల్ మండల పరిషత్ కార్యాలయంలోని తనఛాంబర్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పెద్దేముల్ మండలంలోని వివిధ పాఠశాలలు, గురుకులాల్లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థిని, విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈసమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు శోభారాణి, ఉపాధ్యక్షులు ఎల్లారెడ్డి, కోఆప్షన్ సభ్యులు నసీరుద్దిన్, ఆనందచారి, డీవై.నర్సింహులు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ప్రజాపాలన దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు



ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దార్ వెంకటేశ్

బొంరాస్‌పేట్, జనవరి 9: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాలకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియ కొనసాగుతోంది. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజాపాలన దరఖాస్తులను కంప్యూటర్ ఆపరేటర్‌లు చేస్తున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను తహసీల్దార్ వెంకటేశ్ పరిశీలించారు.

నాపరాతి వ్యాపారాభివృద్ధికి కృషి

● ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న తాండూరు మండల క్వారీ అసోసియేషన్, స్టోన్ అసోసియేషన్ ప్రతినిధులు

తాండూరు రూరల్, జనవరి 9: నాపరాతి వ్యాపారుల అభివృద్ధికి కృషి చేస్తానని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు మండల క్వారీ అసోసియేషన్, స్టోన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాండూరు నాపరాతికి దేశంలోనే మంచి ఆదరణ ఉందన్నారు. పట్టణంలో కాలుష్య నివారణకు జినరుగుర్తి గేటువద్ద పారిశ్రామికవాడ కూడా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కరెంటు చార్జీలు తగ్గించాలని కోరుతూ క్వారీ, స్టోన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో క్వారీ అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, ప్రధాన కార్యదర్శి జుబేర్‌లాల, జైనొద్దీన్, స్టోన్ అసోసియేషన్ అధ్యక్షుడు నయీం(అప్పు), ఫయాజ్, సంజీవ్ కుమార్, వ్యాపారులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులు



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న తాండూరు మండల క్వారీ అసోసియేషన్, స్టోన్ అసోసియేషన్ ప్రతినిధులు

శామీర్‌పేట, జనవరి 9: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులని ఐసీడీఎస్ అంగన్‌వాడీ ప్రాజెక్టు డైరెక్టర్ కృష్ణారెడ్డి అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పరిపల్లి, అంతాయిపల్లి, హకీంపేట, సింగాయిపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో హెచ్‌బీఎల్ సంస్థ వారు ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని, పలుకలు, కప్పులు, సాపలు, పిల్లలకు అవసరమైన ఇతర వస్తువులను అంగన్‌వాడీ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీలో చదువుతున్న పిల్లల ఎదుగుదలకు, ఆరోగ్యానికి పౌష్టికాహారం ఎంతగానో దోహదపడుతుందని వివరించారు. అంగన్‌వాడీల్లో విద్యనభ్యసిస్తున్న పిల్లలకు కేంద్రాల్లో ప్రతీరోజు కోడిగుడ్లు, పౌష్టికాహారాన్ని బాధ్యతగా అందిస్తున్నామని తెలిపారు. అంగన్‌వాడీ పిల్లలకు పౌష్టికాహారంతో పాటు అవసరమైన ఇతర వస్తువులను ఎంతో ఉన్నతాశయంతో ముందుకు వచ్చి అందజేసిన హెచ్‌బీఎల్ సంస్థవారికి ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ పాండు, సీడీపీవో ఉదయశ్రీ, సూపర్‌వైజర్ పద్మ, హెచ్‌బీఎల్ కంపెనీ ప్రొడక్షన్ జీఎం సుధాకర్, సీఎస్ఆర్ అసోసియేటర్ విజయలక్ష్మి, సీఎస్ఆర్ కోఆర్డినేటర్ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలి



ఎక్సెంచర్ సంస్థకు ఎంపికైన విద్యార్థులతో ఏసీఈ కళాశాల కార్యదర్శి వైవీ గోపాలకృష్ణమూర్తి, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 9: కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఏసీఈ కళాశాల కార్యదర్శి వైవీ గోపాలకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని అంకుషాపూర్ ఏసీఈ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం ఎక్సెంచర్ మల్టీనేషన్ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 151మంది ఏసీఈ ఇంజనీరింగ్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే విద్యార్థులు కష్టపడి చదవాలన్నారు. అప్పుడే ఎంచుకున్న లక్ష్యాలను చేరుతామన్నారు. తమ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు క్యాంపస్ రిక్రూట్‌మెంట్ ట్రెయినింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎక్సెంచర్ సంస్థలో ఎంపికైన విద్యార్థులను ఆయన అభినందించారు. కమ్యునికేషన్, సాంకేతిక, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీఈ కళాశాల సంయుక్త కార్యదర్శి పద్మావతి, ప్రిన్సిపాల్ బీఎల్ రాజు, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి



కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

మూడుచింతలపల్లి, జనవరి 9: కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని కొల్తూర్, నారాయణపూర్ సర్పంచ్‌లు రాంచంద్రయ్య, శిల్పాయాదగిరిలు అన్నారు. మండలంలోని కొల్తూర్, నారాయణపూర్ గ్రామాల్లో మంగళవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు కేంద్ర ప్రభుత్వ పథకాలకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. రైతులకు సబ్సిడీతో అందించే పరికరాలను కొనుగోలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, ఉపసర్పంచులు, వార్డుసభ్యులు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్షింతల పంపిణీ



టేకుల్‌కోడ్‌లో శ్రీరాముడి అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొడంగల్ రూరల్, జనవరి 9: ఈనెల 22న అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని రాముడి విగ్రహాన్ని అభిషేకించిన అక్షింతలను ఇంటింటికి పంపిణీ చేశారు. కొడంగల్ మండలంలోని టేకుల్‌కోడ్ గ్రామంలో మంగళవారం అయోధ్య నుంచి కలశాలలో వచ్చిన అక్షింతలను ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కలశాన్ని, స్వామివారి ఫొటోలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. ఇంటింటా కరపత్రాలు, అక్షింతలు పంచారు. ఈ కార్యక్రమంలో పూజారి జగన్, గ్రామస్థులు బస్వరాజ్, మల్లికార్జున్, పాండప్ప, గోవర్ధన్‌రెడ్డి, బస్వరాజ్, వెంకటప్ప, రామకృష్ణ, మల్‌రెడ్డి, కుర్వ కిష్టప్ప, నాందేవ్, మాణిక్యప్ప పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి



మాట్లాడుతున్న జగదీశ్

కొడంగల్, జనవరి 9: స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని మంగళవారం కొడంగల్ పట్టణంలోని శ్రీ గాయత్రీ పాఠశాలలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జయంతి సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాసం, దేశభక్తి గీతాలు తదితర అంశాలపై పోటీలు నిర్వహించి ప్రతిభ కనబర్చిన వారికి ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. మోటివేషనల్ ప్రముఖ వక్త జాగిరి జగదీశ్, కొడంగల్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉషారాణి, ఎస్ఐ భరత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రాము, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్‌కు సన్మానం



లచ్చిరెడ్డిని సన్మానిస్తున్న వీఆర్ఏ హక్కుల సాధన సమితి నాయకులు

వికారాబాద్, జనవరి 9: సీఎంఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డిని తెలంగాణ వీఆర్ఏ హక్కుల సాధన సమితి రాష్ట్ర కన్వీనర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో వీఆర్ఏలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్, సతీష్, చిరంజీవి, అశోక్, శివరాం పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై తహసీల్దార్‌కు ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న అప్పాయిపల్లి గ్రామస్తులు

కొడంగల్, జనవరి 9: మండలంలోని అప్పాయిపల్లి గ్రామంలోని రేషన్ డీలర్ కిషన్‌సింగ్‌పై గ్రామస్తులు మంగళవారం కొడంగల్ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలో రేషన్‌డీలర్‌గా కొనసాగుతున్న కిషన్‌సింగ్ అక్రమాలకు పాల్పడుతున్నాడని పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆరోపించారు. గ్రామంలో ఏవిధమైన కార్డులు ఉన్నాయని, తదితర వివరాలు కావాలని అడిగితే సమాచారం ఇవ్వడం లేదన్నారు. రేషన్‌డీలర్‌ను తొలగించాలని గ్రామస్థులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బందెయ్యగౌడ్, కాశప్ప, లక్ష్మప్ప, నాగేశ్, వెంకటప్ప, పకీరప్ప, రఫీ, వెంకటప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మేకలకు మందులు వేస్తున్న పశువైద్యులు

ధారూరు, జనవరి 9: పాడి పశువుల ఆరోగ్యంపై పాడిరైతులు శ్రద్ధ వహించాలని పశుసంవర్ధకశాఖ విశ్రాంత అధికారి డాక్టర్ పున్నయ్య అన్నారు. మండలంలోని హరిదాసుపల్లి, నర్సాపూర్ గ్రామాల్లో కేరెల్లి సత్యసాయి సేవాసమితి, పశుసంవర్ధక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. హరిదాసుపల్లిలో 954పశువులకు చికిత్సలు చేసి టీకాలు వేశారు. 30మంది రైతులకు లవణ మిశ్రమం, బలవర్ధక ఆహారాన్ని పంపిణీ చేశారు. నర్సాపూర్‌లో 543 పశువులకు చికిత్సలు చేసి 43మంది రైతులకు లవణ మిశ్రమం, బలవర్ధక ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు స్వర్ణలత, పద్మాకర్‌రావు, శ్రీకర్‌రెడ్డి, హాథిరామ్, శ్రీసత్యసాయి సేవాసంస్థల సేవాదల్‌సభ్యులు నరేష్, నారాయణరెడ్డి, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

శిఖం భూమిని కాపాడాలి

కులకచర్ల, జనవరి 9: మండలంలోని ఘనపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో గల ప్రభుత్వ శిఖం భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్ డిమాండ్ చేశారు. కులకచర్ల తహసీల్దార్ మురళీధర్‌కు మంగళవారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఘనపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెం.125లో గల భూమి ప్రభుత్వ శిఖం భూమిగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్నదని తెలిపారు. అయితే అట్టి భూమిని కొందరు కబ్జాచేశారని ఆరోపించారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. ఆ భూమిని పేదలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇతర ప్రభుత్వ అవసరాలకు వినియోగించాలన్నారు. లేదంటే పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ మేరకు స్పందించిన తహసీల్దార్ విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.